


## ఉపాధ్యాయుడి డిప్యూటేషన్ రద్దు చేయాలని డీఈఓ కు వినతి




# సంగారెడ్డి మెదక్

శుక్రవారం 02 అక్టోబర్ 2026 www. praja jyothi news.com పేజీలు:07


# ఇది "హైవే" అవినీతి

## - జాతీయ రహదారి నిర్మాణం పనుల్లో కొరవడిన నిఘా

## - అడుగడుగునా నాసిరకం పనుల తో నేషనల్ హైవే విస్తరణ



## - హైవే నాణ్యత నవ్వుల పాలు

## - కోట్లాది రూపాయల నిధులు నేలపాలు

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి :**

సంగారెడ్డి జిల్లా పరిధిలో జరుగుతున్న 65వ నెంబర్ జాతీయ రహదారి విస్తరణ పనులు నాసిరకంగా కొనసాగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇది నిజమే అన్నట్టుగా అడుగడుగునా నాసిరకం మెటీరియల్ తో హైవే విస్తరణ పనులు కొనసాగుతున్నా యి.కిలోమీటర్ల పొడవునా జరుగుతున్న పనులను నిరంతరం పర్యవేక్షించాల్సిన యంత్రాంగం నిద్ర నటిస్తుండడంతో పనులు పొందిన బడా కాంట్రాక్టు సంస్థలు పనులను ముక్కలుగా విభజించి సబ్ కాంట్రాక్ట్ ఇవ్వడంతోనే రహదారి నిర్మాణం పనులు నాణ్యత లోపంగా జరుగుతున్నట్టు తెలుస్తున్నది.





# ఉపాధి హామీ పథకంతో ఫారం పాండ్ల నిర్మాణం

## రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్ రఘువీర్ సూచన

**కల్హేర్, అక్టోబర్ 1, ప్రజాజ్యోతి:**

కల్హేర్ మండలంలో వీబీజీ రాంజీ ఉపాధి హామీ పథకం ద్వారా రైతుల పొలాల్లో ఫారం పాండ్ల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు ఫీల్డ్ అసిస్టెంట్ రఘువీర్ తెలిపారు. ఇందులో భాగంగా పెరుమాండ్ల సాయిలు పొలంలో ఫారం పాండ్ పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.ఉపాధి హామీ పథకం కింద అర్హత కలిగిన రైతులు ఫారం పాండ్లతో పాటు అందుబాటులో ఉన్న ఇతర పనుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ సమాచారాన్ని గ్రామాల్లోని రైతులు, ప్రజలకు తెలియజేసి, ఆసక్తి ఉన్న వారు సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు.పనులు మంజూరు కోసం స్థానిక ఎంపీడీవో, గ్రామ పంచాయతీ కార్యదర్శి లేదా సంబంధిత టెక్నికల్ సిబ్బందిని సంప్రదించాలని ఫీల్డ్ అసిస్టెంట్ రఘువీర్ సూచించారు. ఉపాధి హామీ పథకంలో లభిస్తున్న ఈ అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సంప్రదించాల్సిన ఫోన్: 9182865824

# తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీ .డబ్ల్యు.జ.ఎఫ్ ).

## - నూతన కార్యవర్గానికి మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఘన సన్మానంలి

## - జర్నలిస్టులకు ఎల్లప్పుడూ అండగా ఉంటాం

## : మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి

**కల్హేర్/ నారాయణఖేడ్, అక్టోబర్ 1, ప్రజాజ్యోతి:**

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీ.డబ్ల్యూ.జే ఎఫ్) నూతన కార్యవర్గాన్ని నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్‌రెడ్డి గురువారం ఘనంగా సన్మానించారు. నారాయణఖేడ్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మధ్యాహ్నం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. జర్నలిస్టులకు ఎల్లప్పుడూ తన వంతు సహాయ సహకారాలు అందించేందుకు







ముందుంటానని తెలిపారు. గతంలో తమ ప్రభుత్వ హయాంలో జర్నలిస్టులకు పెద్ద ఎత్తున ఇంటి స్థలాల పట్టాలు అందించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ఉన్నా లేకపోయినా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు ప్రభుత్వ పథకాలు, ప్రజలకు సంబంధించిన అంశాలను సమగ్రంగా, వాస్తవాలను ప్రతిబింబించేలా వార్తల రూపంలో అందిస్తూ ప్రజల్లో చైతన్యం కల్పించడంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని అన్నారు. జర్నలిస్టులు సమదృష్టితో వార్తలను రాయడం ప్రజాస్వామ్యానికి శుభపరిణామమని పేర్కొన్నారు.జర్నలిస్టులకు సంబంధించిన ఇంటి నిర్మాణ బిల్లులు లేదా ఇతర సమస్యల్లో జాప్యం జరిగితే అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం అందిస్తానని భూపాల్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వాలు వస్తుంటాయి.. మారుతుంటాయి.. కానీ ప్రజలకు వాస్తవ సమాచారాన్ని అందించే జర్నలిస్టుల సేవలు నిరంతరం కొనసాగుతాయని అన్నారు.అనంతరం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ నూతన అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, ప్రత్యేక ఆహ్వానితులు, సభ్యులను మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో (టీ.డబ్ల్యూ జే ఎఫ్) నాయకులు, జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

---

# ఉపాధ్యాయుడి డిప్యూటేషన్ రద్దు చేయాలని డీఈఓ కు వినతి

మొదటిపేజీ తరువాయి



**హత్నూర 1 అక్టోబర్ (ప్రజాజ్యోతి)**

మండల పరిధిలోని గుండ్ల మాచునూర్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు అజ్మత్ అలీ డిప్యూటేషన్ ను రద్దు చేయాలని గ్రామ సర్పంచ్ బేగరి శ్రీహరి ఉప సర్పంచ్ శంకర్ లు గురువారం నాడు జిల్లా విద్యాధికారి రోహిణి నీ కలిసి వినతి పత్రం అందజేశారు. గ్రామంలో నీ  యుపిఎస్ పాఠశాలలో ఇప్పటికే విద్యార్థులకు సబ్జెక్టులకు సరిపడ  ఉపాధ్యాయుల లేక విద్యార్థులు అవస్థలు పడుతుంటే, ఉన్న ఉపాధ్యాయులను డిప్యూటేషన్ పేరుతో బదిలీ చేయడం సరైనది కాదని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇలా ఉపాధ్యాయులను తరచూ బదిలీ చేసుకుంటూ పోతే విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని తెలిపారు. కావున ఉపాధ్యాయుడు అజ్మత్ అలీ డిప్యూటేషన్ వెంటనే రద్దు చేసి తిరిగి స్థానిక పాఠశాలలోనే ఉండేలా చూడాలని వారు డీఈఓ ను కోరారు. వార్డు సభ్యులు జగన్ యాదవ్, సంతోషా రమేష్ లు డిఈ ఓ ను కలిసిన వారిలో ఉన్నారు.

# తప్పుడు పత్రాలతో ప్రభుత్వ భూమిపై హక్కు పొందేందుకు యత్నం

## ఇద్దరిపై కేసు నమోదు.. దర్యాప్తు చేస్తున్న పోలీసులు

**శివ్వంపేట ప్రజాజ్యోతి అక్టోబర్ 01:**



ప్రభుత్వ భూమిపై హక్కు పొందేందుకు తప్పుడు పటా/అసైన్‌మెంట్ ధ్రువపత్రాన్ని సమర్పించినట్లు వచ్చిన ఫిర్యాదుపై శివ్వంపేట పోలీసులు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.శివ్వంపేట మండలం చండి గ్రామం (జగ్యా తండా)కు చెందిన కోలా రాజు,కోలా చిట్టిలు ఈ వ్యవహారంలో నిందితులుగా ఉన్నారు.అధికారుల వివరాల ప్రకారం.. సర్వే నంబర్ 153లోని 8.05 ఎకరాల భూమికి ఎలక్ట్రానిక్ పట్టాదారు పాస్‌బుక్ (ఈ పి పి బి) కోసం కోలా రాజు పేరుతో డీ/1165/97 నంబర్ గల ధ్రువపత్రాన్ని సమర్పించారు.అయితే రెవెన్యూ రికార్డులను పరిశీలించగా,ఆ ధ్రువపత్రం కోలా రాజు పేరుతో జారీ కాలేదని,అదే నంబర్ వేరే వ్యక్తికి జారీ చేసిన ఆదాయ ధ్రువపత్రానికి




సంబంధించినదిగా అధికారులు గుర్తించారు.అదే ధ్రువపత్రాన్ని గతంలో 14.20 ఎకరాల భూమికి సంబంధించిన దరఖాస్తులో కూడా ఉపయోగించినట్లు అధికారుల పరిశీలనలో వెల్లడైంది.అలాగే అటవీ భూమి ఆక్రమణకు సంబంధించి కోలా రాజుపై గతంలో కేసు నమోదైనట్లు అధికారుల నివేదికలో పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో తప్పుడు/కల్పిత పత్రాలను ఉపయోగించి ప్రభుత్వ,అటవీ భూమిపై అక్రమంగా హక్కు పొందేందుకు ప్రయత్నించినట్లు శివ్వంపేట తహసీల్దార్ (ఎంఆర్ఓ) ఇచ్చిన ఫిర్యాదు మేరకు శివ్వంపేట ఎస్సై మధుకర్‌రెడ్డి కేసు నమోదు చేశారు.ఘటనపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

---

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నేడు నిరసన

**పటాన్ చెరు(ప్రజాజ్యోతి)**

జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం నేడు దేశవ్యాప్తంగా నిర్వహించనున్న నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని టీయూడబ్ల్యూజే(ఐజేయు) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కే. విరహత్ అలీ, ప్రధాన కార్యదర్శి రామనారాయణ పిలుపునిచ్చారు.



ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ పిలుపులో భాగంగా తెలంగాణలోని అన్ని జిల్లాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రుమాండ్ల అనిల్ కుమార్ మాట్లాడుతూ.. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం టీయూడబ్ల్యూజే (ఐజేయు) ఆధ్వర్యంలో నిరంతరం పోరాటం కొనసాగుతుందని తెలిపారు.నేడు సంగారెడ్డిలో నిర్వహించే నిరసన కార్యక్రమానికి జిల్లా జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

---

## అధ్వానంగా మునిదేవునిపల్లి ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం!

### సబ్‌హెడ్‌లైన్: అధికారుల పర్యవేక్షణ లేకే ఈ నిర్లక్ష్యమా..?

### నాణ్యమైన భోజనం అందించాలని విద్యార్థుల తల్లిదండ్రుల డిమాండ్..

**కొండాపూర్ ప్రజా జ్యోతి**

మండల పరిధిలోని మునిదేవునిపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంపై విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భోజనం నాణ్యతపై తగిన పర్యవేక్షణ లేకపోవడంతో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావం పడే అవకాశం





ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యమైనదిగా, పరిశుభ్రంగా ఉండేలా సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన అవసరం ఉందని గ్రామస్తులు పేర్కొన్నారు. అయితే అధికారుల పర్యవేక్షణ లోపించడం వల్లే భోజన నాణ్యత విషయంలో నిర్లక్ష్యం చోటుచేసుకుంటుందా అని వారు ప్రశ్నిస్తున్నారు.విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనం అందించేలా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, గ్రామస్తులు డిమాండ్ చేశారు. భోజనం నాణ్యతలో నిర్లక్ష్యం కొనసాగితే విద్యార్థులకు అనారోగ్య సమస్యలు, ఫుడ్ పాయిజనింగ్ వంటి ప్రమాదాలు తలెత్తే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మధ్యాహ్న భోజన పథకంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, వంటశాల పరిశుభ్రత, ఆహార పదార్థాల నాణ్యత, భోజనం తయారీ విధానాన్ని క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

# జర్నలిస్టుల ఆరోగ్య భద్రతకు పోస్ట్‌కార్డు ఉద్యమం

## - అక్టోబర్ 2 నుంచి 8 వరకు రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమం.

## -భారీ ఎత్తున సంగారెడ్డికి తరలిరావాలని టి యు డబ్ల్యూ జే హెచ్ 143 పిలుపు.

**పటాన్‌చెరు(ప్రజాజ్యోతి)**




జర్నలిస్టులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా క్యాష్‌లెస్ ఆరోగ్య కార్డులు జారీ చేయడంతో పాటు, మెరుగైన వైద్య సేవలు అందించేలా ఈజేహెచ్‌ఎస్ పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ రాష్ట్ర కమిటీ దశలవారీ ఉద్యమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా గాంధీ జయంతి పురస్కరించుకొని నేడు అన్ని జిల్లా కేంద్రాల్లో పోస్ట్‌కార్డు ఉద్యమాన్ని ప్రారంభించనున్నారు. అక్టోబర్ 8 వరకు వారం రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని యూనియన్ రాష్ట్ర నాయకత్వం పిలుపునిచ్చింది. 50 పైసల పోస్ట్‌కార్డుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి జర్నలిస్టుల ఆరోగ్య భద్రతకు సంబంధించిన డిమాండ్ లను రాసి ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపించాలని సూచించింది. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జర్నలిస్టులకు క్యాష్‌లెస్ హెల్త్ కార్డులు అందించాలని, ప్రస్తుతం ఉన్న ఆరోగ్య సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు ఈ జె. హెచ్.ఎస్ పథకాన్ని పునరుద్ధరించాలని కోరుతూ పోస్ట్‌కార్డులు పంపనున్నారు. పోస్ట్‌కార్డులను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం సీఎమ్ఓ 6వ అంతస్థు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం, హైదరాబాద్500022 చిరునామాకు పంపాలని రాష్ట్ర నాయకులు సూచించారు. ప్రతి జర్నలిస్టు తన పేరు, పనిచేస్తున్న సంస్థ, జిల్లా వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని తెలిపారు. రాష్ట్ర, జిల్లా నాయకత్వం పిలుపు మేరకు పటాన్‌చెరు నియోజకవర్గం నుంచి జర్నలిస్టులు అధిక సంఖ్యలో సంగారెడ్డికి తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, పటాన్‌చెరు నియోజకవర్గ అధ్యక్షుడు రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి మహేష్ గౌడ్, తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు గోకర్ శేఖర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి చింతల రామకృష్ణ పిలుపునిచ్చారు.

# యాంటీమైక్రోబయల్ నిరోధకతపై అవగాహన

## - గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీలో జాతీయ ఫార్మసీ వారోత్సవాలు

## - విద్యార్థుల సృజనాత్మకతకు వేదికగా వివిధ పోటీలు



**పటాన్ చెరు(ప్రజాజ్యోతి)**

యాంటీమైక్రోబయల్ నిరోధకత (ఏఎంఆర్)పై ప్రజల్లో, భవిష్యత్ ఫార్మసిస్టుల్లో అవగాహన పెంచేందుకు గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో జాతీయ ఫార్మసీ వారోత్సవాలు-2026ను నిర్వహించారు. గురువారం ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవం సందర్భంగా 'యాంటీమైక్రోబయల్ నిరోధకతను ఎదుర్కోవడం' పలు అవగాహన, సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహించారు. వారోత్సవాల్లో భాగంగా ఫార్మా క్విజ్, సైంటిఫిక్ పోస్టర్ ప్రజెంటేషన్, డిజిటల్ రీల్స్ మేకింగ్, నుక్కడ్ నాటక్ (వీధి నాటకం), సైటూన్స్ (సైన్స్ కార్టూన్లు), కరపత్రాల రూపకల్పన తదితర పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థులు తమ శాస్త్రీయ పరిజ్ఞానం, సృజనాత్మకత, భావప్రసార నైపుణ్యాలు, బృంద స్ఫూర్తిని ప్రదర్శించే అవకాశం పొందారు. పోటీల్లో చురుకుగా పాల్గొన్న విద్యార్థుల ప్రతిభను ఫార్మసీ స్కూల్ యాజమాన్యం అభినందించింది. కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. శివకుమార్ ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేసి సత్కరించారు. యాంటీమైక్రోబయల్ నిరోధకతపై అవగాహన కల్పించడంతోపాటు విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించేలా కార్యక్రమాలు నిర్వహించడం పట్ల విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.



### పరిశుభ్రతతోనే ఆరోగ్యకర సమాజం





పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని చాటి చెప్పుతూ గీతం డీమ్డ్ విశ్వ విద్యాలయానికి చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు, సిబ్బంది స్వచ్ఛతా కార్యక్రమం నిర్వహించారు. గురువారం రుద్రారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'ఒక గంట.. అంతా కలిసి' పేరుతో సామూహిక పరిశుభ్రతా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు విద్యార్థులు, స్థానిక ప్రజలకు పారిశుద్ధ్యం, పౌర బాధ్యత, సామాజిక భాగస్వామ్యంపై అవగాహన కల్పించారు. పరిశుభ్రమైన వాతావరణం ఆరోగ్యకర జీవనానికి ఎంతగానో దోహదపడుతుందని వివరిస్తూ, పరిసరాల పరిశుభ్రతలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. గీతం ఎన్‌సీసీ క్యాడెట్లు, సిబ్బందికి రుద్రారం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వాగతం పలికి, విద్యార్థుల్లో పరిశుభ్రత, బాధ్యతాయుత పౌరసత్వ భావనలను పెంపొందించేందుకు చేపట్టిన కార్యక్రమాన్ని అభినందించారు. క్రీడా విభాగం కోచ్‌లు, సిబ్బంది సహకారంతో గీతం హైదరాబాద్ ఎన్‌సీసీ యూనిట్ సమన్వయకర్త లెఫ్టినెంట్ అజయ్‌కుమార్ కార్యక్రమాన్ని సమన్వయం చేసి పర్యవేక్షించారు. పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి సామూహిక చర్య, ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమనే సందేశాన్ని ఎన్‌సీసీ క్యాడెట్లు ఈ కార్యక్రమం ద్వారా చాటిచెప్పారు.

# చిన్నారుల భవిష్యత్తుకు సృజనాత్మక విద్య అవసరం

## - నాణ్యమైన విద్యతో పాటు ఆహ్లాదకర వాతావరణం కీలకం

## - పోస్టర్ కిడ్స్ ప్లే స్కూల్‌ను సందర్శించిన మాద్రి పృథ్వీరాజ్

**పటాన్ చెరు(ప్రజాజ్యోతి)**

చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు నాణ్యమైన విద్యతో పాటు ఆటలు, సృజనాత్మక కార్యక్రమాలతో కూడిన ఆహ్లాదకర వాతావరణం ఎంతో అవసరమని యండిర్ ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ అన్నారు. జేపీ కాలనీలో ఇటీవల నూతనంగా ప్రారంభమైన పోస్టర్ కిడ్స్ ప్లే స్కూల్‌ను






ఆయన సందర్శించి నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నారులకు కేవలం పుస్తకాల ద్వారా విద్యను అందించడం మాత్రమే కాకుండా, ఆటలు, సృజనాత్మక కార్యక్రమాలు, ఆహ్లాదకరమైన వాతావరణం ద్వారా వారి ప్రతిభను వెలికితీయాలని సూచించారు. చిన్న వయసులోనే పిల్లల్లో ఆత్మవిశ్వాసం, సృజనాత్మక ఆలోచన, సామాజిక నైపుణ్యాలను పెంపొందించేలా విద్యా విధానం ఉండాలని పేర్కొన్నారు. పిల్లల అభిరుచులు, ఆసక్తులను గుర్తించి వారికి అనుగుణంగా ప్రోత్సాహం అందిస్తే భవిష్యత్తులో మరింత ప్రతిభావంతులుగా ఎదిగే అవకాశం ఉంటుందన్నారు. పోస్టర్ కిడ్స్ ప్లే స్కూల్ చిన్నారుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తూ మరింత అభివృద్ధి చెంది మంచి పేరు సంపాదించుకోవాలని ఆకాంక్షించారు.

# మన్నాన్నపల్లికి ఎస్సీ కమ్యూనిటీ హాల్, డ్రైనేజీ, తాగునీటి సౌకర్యాలు మంజూరు చేయాలి..

## - రెండు బోర్లతో పాటు అభివృద్ధి పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌కు వినతి.

**కొండాపూర్ ప్రజా జ్యోతి**

మన్నాన్నపల్లి గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణంతో పాటు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీటి సమస్య పరిష్కారానికి రెండు బోర్లు మంజూరు చేయాలని కోరుతూ గ్రామ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. మాజీ టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డితో కలిసి గ్రామ సర్పంచ్, రామచందర్ రెడ్డి, ఆత్మ కమిటీ డైరెక్టర్ మల్లేశం, కాంగ్రెస్ నాయకులు, వార్డు సభ్యులు రామచంద్రయ్య జిల్లా కలెక్టర్‌ను కలిసి గ్రామంలోని సమస్యలను వివరించారు. ముఖ్యంగా ఎస్సీ వర్గాల కోసం కమ్యూనిటీ హాల్ లేకపోవడంతో వివిధ కార్యక్రమాల నిర్వహణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. అలాగే గ్రామంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయడంతో పాటు తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు రెండు బోర్లు మంజూరు చేయాలని కోరారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు సంబంధిత శాఖల ద్వారా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను విజ్ఞప్తి చేశారు. గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నుంచి సహకారం అందించాలని వారు కోరారు.



# రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు మాసానిపల్లి విద్యార్థులు

## - ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయిలో గోల్డ్ మెడల్స్ సాధించిన నలుగురు విద్యార్థులు

**కల్హేర్, అక్టోబర్ 1, ప్రజా జ్యోతి :**

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం సంగారెడ్డిలో నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి కుస్తీ పోటీల్లో జడ్పీహెచ్ఎస్ మాసానిపల్లి






పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. పోటీల్లో గోల్డ్ మెడల్స్ సాధించి నలుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థుల ప్రతిభ పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓ బి. సురేష్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు రామ్మోహన్‌రావు, పీఈటీ సుధాకర్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ విద్యార్థులు ప్రతిభ కనబరిచి పాఠశాలకు, మండలానికి మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు. క్రీడలతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల పెరుగుతాయని, గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను ప్రోత్సహించేందుకు పాఠశాల స్థాయిలో మరింత ప్రోత్సాహం అందిస్తామని వారు తెలిపారు.

# పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

**నారాయణఖేడ్, అక్టోబర్ 1, ప్రజాజ్యోతి:**

నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ వి. ప్రశాంతి తెలిపారు. గురువారం నారాయణఖేడ్ పురపాలక సంఘం కార్యాలయ ప్రాంగణంలో పారిశుద్ధ్య సిబ్బందికి ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పారిశుద్ధ్య సిబ్బందికి వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య పరిరక్షణపై వైద్యులు పలు సూచనలు చేశారని అన్నారు. ప్రతిరోజూ పారిశుద్ధ్య పనుల్లో భాగంగా ప్రజారోగ్యం కోసం సేవలందిస్తున్న సిబ్బంది తమ ఆరోగ్యంపై కూడా శ్రద్ధ వహించాలని సూచించారు. సిబ్బంది ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, కౌన్సిలర్లు బాణపురం రాజు ముదిరాజ్, షారుక్ ఖాన్, మహేష్ చౌహన్, సుబుర్, గోపాల్, మహితాబ్ తదితరులు పాల్గొన్నారు.




# మునిపల్లి మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా సురేష్

**మునిపల్లి అక్టోబర్ 1 (ప్రజాజ్యోతి):**





1ఎస్ ఆర్ డి 12,అధ్యక్షకార్యదర్శులుగా ఎన్నికైన సురేష్,మొగులయ్య

మునిపల్లి మండల ప్రెస్ క్లబ్ (అక్రిడేటెడ్&నాన్ అక్రిడేటెడ్ )అధ్యక్షులుగా సురేష్ (మన తెలంగాణ )ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. గురువారం నాడు బుదేరాలో ఏర్పాటు చేసిన మండల అక్రిడేటెడ్, నాన్ అక్రిడేటెడ్ విలేకరుల సమావేశంలో మండల కార్యవర్గం ఏర్పాటు అయింది. ప్రధాన కార్యదర్శిగా మొగులయ్య (క్యూ న్యూస్ ), కోశాధికారగా నర్సిములు (సిటీ ఛానల్ ), కార్యవర్గ సభ్యులుగా యాదయ్య (ప్రజా జ్యోతి ), సతీష్ (విజన్ ఆంధ్ర), నవీన్ (వాస్తవ తెలంగాణ ), శ్రీనివాస్ (ఎన్ ఎస్ ఛానల్ ), సలహాదారులుగా నరేష్ (బిగ్ టీవీ స్టాఫర్ ),అంజయ్య (వార్త ), మెహన్ (ప్రజా బలం స్టాఫర్ )లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు సురేష్ మాట్లాడుతూ జర్నలిస్టుల ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

# మండల పరిషత్ సాధారణ సమావేశంలో మహిళా సర్పంచ్ భర్తల పెత్తనం.

## - సర్పంచ్ పదవి భార్యది.. సమావేశంలో పెత్తనం భర్తది!

## - సి.హెచ్. కోనాపూర్ సర్పంచ్‌కు బదులు భర్త హాజరు..

## - రిజిస్టర్‌లో సంతకంపై మండల సమావేశంలో చర్చనీయాంశం...

**కొండాపూర్ ప్రజా జ్యోతి**

మహిళా సర్పంచ్‌లకు బదులుగా వారి భర్తలు అధికారిక సమావేశాల్లో పాల్గొంటున్న ఘటనలు చర్చకు దారితీస్తున్నాయి. గురువారం కొండాపూర్ ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మండల పరిషత్ సాధారణ సమావేశం మండల ప్రత్యేక అధికారి గీత అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో సి.హెచ్. కోనాపూర్ గ్రామ సర్పంచ్ మహేశ్వరీకి బదులుగా ఆమె భర్త హాజరై రిజిస్టర్‌లో సంతకం చేయడం చర్చనీయాంశంగా మారింది.సమావేశంలో మండలంలోని వివిధ గ్రామాల సమస్యలు, అభివృద్ధి పనులపై సర్పంచ్‌లు, అధికారులు చర్చించారు. ఎల్‌నినో ప్రభావంతో రాబోయే రోజుల్లో నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున గ్రామాల్లో ప్రజలకు నీటి పొదుపుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని మాన్సాన్పల్లి సర్పంచ్ రామచంద్రారెడ్డి సూచించారు. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో తాగునీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉందని, ప్రజలు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవికుమార్ సూచించారు.మాందాపూర్ సర్పంచ్ సంగమేశ్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ పనుల కారణంగా అంగన్‌వాడీ టీచర్లు బిజీగా ఉండటంతో కేంద్రాల్లో చిన్నారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. సైదాపూర్ సర్పంచ్ రాధిక రామాగౌడ్ మాట్లాడుతూ సదాశివపేట నుంచి సైదాపూర్ వెళ్లే రహదారిని వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.శివన్నగూడెం సర్పంచ్ వినోద్ మాట్లాడుతూ గ్రామానికి వెళ్లే




రహదారిపై వెంచర్ల యజమానులు ప్రహరీ గోడలు నిర్మిస్తుండటంతో పొలాలకు వెళ్లే రైతులు, గ్రామానికి రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమస్యను ప్రశ్నిస్తే హెచ్‌ఎండీఏకు సంబంధం ఉందంటూ కొందరు వెంచర్ యాజమానులు బెదిరింపులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. వచ్చే మండల సమావేశాలకు హెచ్‌ఎండీఏ అధికారులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరగా, ప్రత్యేక అధికారి గీత స్పందిస్తూ వచ్చే సమావేశానికి హెచ్‌ఎండీఏ అధికారులను హాజరయ్యేలా చూస్తామని తెలిపారు.గొల్లపల్లి సొసైటీ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ గోదాంల నిర్మాణం, పెట్రోల్ బంక్ ఏర్పాటుకు ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని కోరారు. సి.హెచ్. కోనాపూర్ సర్పంచ్ మహేశ్వరీ స్థానంలో ఆమె భర్త సమావేశానికి హాజరై రిజిస్టర్‌లో సంతకం చేయడం ప్రధాన చర్చగా మారింది. ప్రజలచే ఎన్నికైన సర్పంచ్ స్థానంలో భర్త సమావేశానికి హాజరు కావడంపై పలువురు



చర్చించుకున్నారు.ఈ సమావేశంలో ఆత్మ కమిటీ చైర్మన్ వై. ప్రభు, నిడిసి చైర్మన్ గడీల రాంరెడ్డి, ఎంపీడీఓ సౌమ్యశ్రీ, తహసీల్దార్ అశోక్, సర్పంచ్‌లు రామచంద్రారెడ్డి, అనిత, లక్ష్మీకిషన్ నాయక్, స్రవంతి, మండల పశువైద్యాధికారి అహ్మద్, ఏఓ గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

**ఎంపీడీవో వివరణ.**

మండల పరిషత్ సమావేశానికి సర్పంచులనే ఆహ్వానం చేసాం కొందరు పలుమార్లు భార్య స్థలంలో భర్త సమావేశానికి హాజరు కాకూడదని తెలిపాము. సమావేశానికి సర్పంచ్ భర్తలు హాజరైన మాట వాస్తవమే. సమావేశం మధ్యలో సర్పంచ్ భర్తలను పంపించడం జరిగిందని తెలిపారు.

# అంగన్‌వాడీ కేంద్రాల్లో 'సేవా సంకల్ప్ అభియాన్'

**కొండాపూర్ ప్రజా జ్యోతి**



ప్రధాని నరేంద్ర మోదీ జన్మ దినం సందర్భంగా బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు 'సేవా సంకల్ప్ అభియాన్' కార్య క్రమాన్ని మల్కాపూర్ గ్రామ పంచాయతీలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి సూచనలతో మండల బీజేపీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రా లను సందర్శించారు. అంగన్ వాడీ టీచర్లు, సిబ్బందిని సన్మా నించి, చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం, విద్యాబోధన, ఇతర సేవలను పరిశీలించారు. చిన్నారులతో ముచ్చటించి, అంగన్‌వాడీ సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మహిళా నాయకురాలు, మాజీ సర్పంచ్ గొల్ల సత్యమ్మ, జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, జిల్లా నాయకుడు సందీప్ గౌడ్, మండల నాయకులు విష్ణువర్ధన్, మల్లేశం, కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి జర్నలిస్టులు పాటుపడాలి

## డీసీసీ అధ్యక్షుడు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి

**కల్హేర్, అక్టోబర్ 1, ప్రజాజ్యోతి:**



జర్నలిస్టులు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకు వచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పట్లోళ్ల చంద్ర శేఖర్ రెడ్డి అన్నారు.బుధవారం నారాయణఖేడ్ పట్టణంలోని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి నివాసంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ నూతన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ నారాయణఖేడ్ డివిజన్ అధ్యక్షుడు పుట్టి సంజీవ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ బిరదర్ ప్రతాప్, ప్రధాన కార్యదర్శి ఎం.ఏ. కైసర్, కోశాధికారి ఇబ్రహీంఖాన్‌తో పాటు ఉపాధ్యక్షులు, కార్యవర్గ సభ్యులను శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు.అనంతరం చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలను నిరంతరం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా జర్నలిస్టులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. అదే విధంగా జర్నలిస్టుల సమస్యల పరిష్కారంతో పాటు వారి కుటుంబాల సంక్షేమం కోసం నూతన కార్యవర్గం కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఫైయాజ్, సిద్ధారాం, ఆంజనేయులు, పుండ్లిక్, దత్తు గౌడ్, సహాయ కార్యదర్శులు ఫయాజ్, ప్రవీణ్, శంకర్, సతీష్, షాహిభాజ్, డైనియల్, సతీష్, నాగ్ శెట్టి, మోహన్ రాథోడ్, సలహాదారులు అరుణ్, ఈసీ సభ్యులు మజార్, ఆనంద్, ప్రశాంత్, ఓం ప్రకాష్, అబ్దుల్లా, వైజ్యనాథ్, దత్తా సాయి తదితరులు పాల్గొన్నారు.

# ఏడుసార్లు రక్తదానం.. ఆపదలో ఉన్న వారికి అండగా అరవింద్

**కల్హేర్, అక్టోబర్ 1, ప్రజా జ్యోతి:**
సంగారెడ్డి జిల్లా నిజాంపేటలో 'సేవా సంకల్ప అభియాన్'లో భాగంగా గురువారం బీజేవైఎం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పలువురు యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేసి మానవతా దృక్పథాన్ని చాటారు.ఈ సందర్భంగా కల్హేర్ మండలం మార్డి గ్రామానికి చెందిన బొమ్మల అరవింద్ రక్తదానం చేశారు. అరవింద్ ఇప్పటివరకు ఏడుసార్లు రక్తదానం చేసి, అత్యవసర సమయంలో రక్తం అవసరమైన వారికి తన వంతు సహాయాన్ని అందిస్తున్నారు. యువతలో రక్తదానంపై అవగాహన పెంచేందుకు అరవింద్ చేస్తున్న సేవలను పలువురు అభినందించారు.



# అమరవీరుడి స్మరణలో సేవా కార్యక్రమాలు

## రవీందర్ (రాజు) 15వ వర్ధంతి సందర్భంగా క్లాకటవర్ వద్ద నివాళులు..

## పేదలకు బిర్యానీ, వృద్ధులకు సహాయక పరికరాల పంపిణీ

**అందోల్, అక్టోబర్ 01, (ప్రజాజ్యోతి):**
తెలంగాణ ఉద్యమ అమరవీరుడు కె.పి. రవీందర్ (రాజు) 15వ వర్ధంతిని పురస్కరించుకుని జోగిపేట పట్టణంలో ఆయన కుటుంబ సభ్యులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక క్లాక్‌టవర్ వద్ద ప్రత్యేకంగా






ఏర్పాటు చేసిన రవీందర్ (రాజు) చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్థానిక పేద ప్రజలకు బిర్యానీ పొట్లాలను పంపిణీ చేయడంతో పాటు, వయోవృద్ధులకు అవసరమైన వాకింగ్ సపోర్ట్ స్టిక్స్, చేతి సపోర్ట్ కట్టెలను అందజేశారు.అమరవీరుడి జ్ఞాపకాలను కేవలం వర్ధంతి కార్యక్రమాలకే పరిమితం చేయకుండా, పేదలు, వృద్ధులకు సేవ చేయడం ద్వారా ఆయనను స్మరించుకోవడం సంతృప్తినిస్తోందని కుటుంబ సభ్యులు తెలిపారు. సమాజంలోని నిరుపేదలు, వయోవృద్ధులకు అండగా నిలవడమే రవీందర్ (రాజు) జ్ఞాపకాలకు తగిన నివాళి అని పేర్కొన్నారు.ఈ సందర్భంగా "జోహార్ తెలంగాణ అమరవీరుడు కె.పి. రవీందర్ (రాజు)కు జోహార్" అంటూ అమరవీరుడికి ఘన నివాళులర్పించారు.

# కరెంటు కోతలతో రైతులకు తిప్పలు

## వర్షాభావానికి తోడు అప్రకటిత విద్యుత్ కోతలు.. పంటలపై తీవ్ర ప్రభావం



**అందోల్, అక్టోబర్ 01, (ప్రజాజ్యోతి):**
వర్షాభావ పరిస్థితులతో ఇప్పటికే ఆందోళనలో ఉన్న రైతులకు అప్రకటిత విద్యుత్ కోతలు మరింత ఇబ్బందులు తెచ్చిపెడుతున్నాయి. అందోల్ నియోజకవర్గంలోని పలు మండలాల్లో సాగు చేసిన పంటలకు కీలక దశలో నీరు అందక రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. సకాలంలో వర్షాలు కురవక పంటలు ఎండిపోయే పరిస్థితులు నెలకొన్న తరుణంలో, వ్యవసాయానికి అవసరమైన సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడం రైతులకు శాపంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఆరు గాలం శ్రమించి, అప్పులు చేసి సాగు చేసిన పంటలను కాపాడుకునేందుకు రైతులు బోర్లు, బావులపై ఆధారపడుతున్నారు. అయితే విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడటంతో మోటార్లు పనిచేయక పొలాలకు నీరు అందడం లేదని రైతులు చెబుతున్నారు. విద్యుత్ ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితుల్లో రాత్రింబవళ్లు నిరీక్షించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాభావం, విద్యుత్ కోతలు రెండూ కలిసి పంటలను దెబ్బతీస్తే పెట్టుబడులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి ఉండదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

### రైతుల గోడు పట్టించుకోవాలి

వ్యవసాయానికి అత్యంత అవసరమైన సమయంలో విద్యుత్ సరఫరాలో కోతలు విధించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని బీఆర్ఎస్ నాయకులు చాపల వెంకటేశం, సార శ్రీధర్, కుమ్మరి క్రిష్ణ, ఖాజా పాష పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వ్యవసాయానికి నిరంతరాయంగా, అవసరమైన సమయాల్లో విద్యుత్ సరఫరా చేయాలని వారు డిమాండ్ చేశారు. రైతుల పంటలను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఉచిత వైద్యం.. ఉచిత ఈసీజీ.. ఉచిత మందులు.. ఆరోగ్య మహాశిబిరం .

## నారాయణఖేడ్ చరిత్రలో తొలిసారి భారీ వైద్య శిబిరం..

## ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలి

## ఉచిత మెగా వైద్య శిబిరం. లయన్ క్లబ్ ఆధ్వర్యంలో






**కల్హేర్ , అక్టోబర్ 1, ప్రజాజ్యోతి:**
నారాయణఖేడ్‌లో అక్టోబర్ 2న ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణఖేడ్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం, బాలాజీ అనురాధ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు.ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే ఈ శిబిరంలో కార్డియాలజీ, గైనకాలజీ, డయాబెటాలజీ, ఆర్థోపెడిక్స్, న్యూరాలజీ, క్రిటికల్ కేర్, జనరల్ సర్జరీ తదితర విభాగాలకు చెందిన వైద్య నిపుణులు పాల్గొని ప్రజలకు వైద్య సేవలు అందించనున్నారు.శిబిరంలో ఉచిత వైద్య సంప్రదింపులు, ఈసీజీ, మందులు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. అలాగే 2ఙ ఎకో పరీక్షను రూ.599కే, ఎండోస్కోపీని రూ.999కే నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వైద్యులు సూచించిన ఇతర పరీక్షలపై 40 శాతం రాయితీ కల్పించనున్నట్లు తెలిపారు.నారాయణఖేడ్ చరిత్రలోనే తొలిసారిగా ఇంత భారీ స్థాయిలో నిర్వహిస్తున్న ఈ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.గమనిక: ఎండోస్కోపీ పరీక్ష చేయించుకునే వారు ఉదయం ఖాళీ కడుపుతో శిబిరానికి రావాలని సూచించారు.వేదిక: మెయిన్ రోడ్, హనుమాన్ కాలనీ, మంగళ్‌పేట్, ఆక్సిజన్ పార్క్ ఎదురుగా, ఆర్టీసీ బస్‌స్టాండ్ సమీపంలో, నారాయణఖేడ్.లో